ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 | సంచిక : 11 | జూలై 2013

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......... 15-05-2013

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-05-2013, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు అని అర్థం. ఈ రోజు శంకరజయంతి. ఆచార్యులవారు శరీరం ధరించింది కాలడీలో, ఆయన కేదార్‌లో శరీరం విడిచిపెట్టారు. ఆయన శరీరం చనిపోయింది అని కొంతమంది చెపుతారు, ఆయన శరీరం శవం అవ్వలేదు, అదృశ్యమయ్యాడు అని కొంతమంది చెపుతారు. కేదార్‌లో ఆయన సమాధి ఉంది. మనకు బడికంటే జీవితమే ఎక్కువ పాఠాలు నేర్పుతుంది. చివరి శ్వాసవరకు నేను పాఠాలు నేర్చుకొంటూనే ఉంటాను అని రామకృష్ణపరమహంసగారు చెప్పారు. ప్రకృతిలోనుండి, సమాజంలో నుండి మనం నేర్చుకొనే పాఠాలు చాలా ఉంటాయి. పూర్వం ఆర్థిక సమస్యలు ఎక్కువగా ఉండేవి, ఇప్పుడు సాంఘిక సమస్యలు పెరిగి పోతున్నాయి. అన్ని సమస్యలకు, మీకు ఏదైనా దుఃఖం వచ్చినా, అశాంతి వచ్చినా వీటి అన్నింటికి మన లోపల ఉన్న అజ్ఞానమే కారణం. మనకు అన్ని భోగాలు ఎదురుగా ఉన్నా లోపల అజ్ఞానం ఉంటే అశాంతి వచ్చి తీరుతుంది, దుఃఖం వచ్చి తీరుతుంది. ఈ అశాంతిని ఎలా పోగొట్టుకోవాలో మనకు ప్రకృతి, సమాజం ఎక్కువగా పాఠాలు నేర్పుతాయి..

ఆచార్యులవారి రచనలు స్తోత్రాలు, ప్రకరణ గ్రంథాలు, బాష్య గ్రంథాలు అని మూడు రకాలుగా ఉంటాయి. దేవతల మీద చాలా స్తోత్రాలు వ్రాసారు. భగవంతుడు ఒక్కడేకాని ఆయనను ఎవరికి ఇష్టమైన

రూపంలో వారు ఆరాధించుకోవచ్చు అని చెప్పారు. ఒకడికి రాముడు అంటే ఇష్టం, ఒకడికి శివుడు అంటే ఇష్టం, ఒకడికి దేవి అంటే ఇష్టం అలా ఎవరి ఇష్టదేవతను వారు ప్రార్థించుకోవచ్చు. అందుచేత అందరి దేవతల మీద స్తోత్రాలు వ్రాసారు. ప్రకరణ గ్రంథాలు అంటే వేదాలలో, ఉపనిషత్‌లలో చెప్పిన సారాన్ని ఆయన సొంత మాటలలో చెప్పారు, వాటిని ప్రకరణ గ్రంథాలు అంటారు, అందులో వివేక చూడామణి ఒకటి. ఇక భాష్య గ్రంథాలు అంటే ఉపనిషత్తులమీద, బ్రహ్మసూత్రాలమీద, భగవద్గీతమీద వ్యాఖ్యానం వ్రాసారు. వాటిని భాష్య గ్రంథాలు అంటారు. ఈ భాష్యగ్రంథాలను వ్రాయటమే కాకుండా దేశం అంతా తిరిగి ప్రచారం చేసారు. అప్పటినుండే భగవద్గీత ఎక్కువ ప్రచారంలోనికి వచ్చింది. ఆచార్యులవారు అనుగ్రహస్వరూపుడు, దయాస్వరూపుడు. మానవజాతిని అనుగ్రహించటంకోసమే శాస్త్రాలలో ఉన్న విషయాలను తీసి మానవజాతికి అర్థమయ్యే లాగ బోధించి వాటిని ప్రచారం చేసారు.

ఆచార్యులవారికి నలుగురు శిష్యులు ఉండేవారు. ఆ నలుగురు వాళ్ళ జీవితాన్ని ఆయనకు అంకితం చేసారు. అందులో పద్మపాదుడు ఒకడు. పద్మపాదుడు ఆచార్యులవారు లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటారు. అంటే మొదటి చూపులోనే చూసిన వెంటనే ప్రేమించుకొన్నారు. కాశీలో మణికర్ణికాఘాట్‌లో ఆచార్యులవారు స్నానం చేసి వస్తున్నారు, పద్మపాదుడు స్నానానికి వెళుతున్నాడు. అప్పుడు ఒకరిని ఒకరు చూసుకొన్నారు, ఆ ప్రేమ జీవితం పొడుగునా అలా ఉండిపోయింది. కాశీలో మణికర్ణికాఘాట్‌లో కలుసుకొన్నారు, కేదార్‌నాథ్‌లో విడిపోయారు. ఆ చివరి టైమ్‌లో ఆచార్యులవారు ఏమన్నారంటే యింతకాలం నుండి మీరు నాకూడా ఉన్నారు, ఇంతవరకు మీరు పెట్టిన అన్నానికి, మీరు ఇచ్చిన బట్టలకు, మీరు చేసిన సేవకు కృతజ్ఞుడిని అన్నారు. ఆచార్యులవారు అలా అన్నప్పుడు పద్మపాదుడు ఏడుస్తాడు. మిమ్మల్ని ఎవరైనా అభివృద్ధిలోనికి తీసుకొని వస్తే మట్టిని బంగారంగా చేసారు అంటారు. నువ్వు అలాకాదువయ్యా. అలా పోల్చటం నాది పొరపాటు. నువ్వు ఏదిగా ఉన్నావో ఆ స్థితికి మమ్మల్ని తీసుకొని పోయావు. మాకు బ్రాహ్మీస్థితిని ప్రసాదించావు. బంగారానికి విలువ ఉంది కాని బ్రహ్మంకు ఎవడు విలువ కట్టగలడు, దానికి మనం విలువ కట్టలేము. నువ్వు మమ్మల్ని బంగారం చేయలేదు, బ్రహ్మంను చేసేశావు. యిదంతా వదిలేసి మేము పెట్టిన భోజనానికి, మేము ఇచ్చిన బట్టలకు కృతజ్ఞత చెపుతూ ఉంటే మేము ఏమని చెపుతాము అని పద్మపాదుడు ఏడ్చాడు.

ఆచార్యుడు అంటే తనకు అనుభవం ఉండాలి. అనుభవంలో ఉన్నది బోధించగల శక్తి ఉండాలి, వినేవాడికి తిండిలేకపోతే అది కూడా పెట్టాలి, వాడు ఆచార్యుడు మీకుకూడా ఆచార్యుడు అయిపోవాలి అని ఉందా, ఇది చాలాకష్టం. ఆచార్యుడు అంటే వాడు ఏమాటైతే చెపుతున్నాడో అది అనుభవంలో ఉండాలి, తన అనుభవంలో ఉన్నదే తీసి చెప్పాలి, ఈ అనుభవానికి శాస్త్రానికీ సరిపోవాలి. వినేవాడికి తిండిలేకపోతే వాడిని పోషించే బాధ్యత కూడా ఆచార్యుడిదే. నరేంద్రుడితో రామకృష్ణుడు అంటాడు నీకు పెట్టటానికి నా దగ్గర ఏమీ లేదు, అందుచేత నీ కోసం నేను భిక్ష చేసుకొంటాను. నువ్వు ఆకలితో బాధపడుతున్నప్పటికీ అన్నం తిన్నట్లు నటిస్తున్నావు. నువ్వు తింటున్నావో లేదో నాకు తెలియదా? నీకు యోగం కావాలి, బ్రహ్మంకావాలి, జ్ఞానం కావాలి. నువ్వు ఆకలితో బాధపడుతున్న భగవంతుడిని అన్నం గురించి అడగవు, బ్రహ్మజ్ఞానం గురించే అడుగుతావు. అన్నం గురించి అడుగు అని నేను చెప్పినా జ్ఞానం గురించే అడుగుతావు తప్ప అన్నం గురించి అడగవు. నేను చెప్పినా అడగటం లేదు కాబట్టి నరేన్ ఐ విల్ బెగ్ ఫర్ యు అంటాడు రామకృష్ణుడు అంటే నీ గురించి నేను ముష్టి చేసుకొంటాను అని చెప్పాడు, వాడు ఆచార్యుడు.

గీతలో పరమాత్మ ఏమని చెప్పాడంటే మనం బట్టలు చిరిగిపోతే పాతబట్టలు తీసేసి కొత్త బట్టలు ఎలా వేసుకొంటామో అలాగే ఈ శరీరాలు చనిపోయినప్పడు జీవుడు పాత శరీరాలను విడిచిపెట్టేసి కొత్త శరీరాలు ధరిస్తాడు అని పరమాత్మ చెప్పాడు. వివేకానంద చనిపోయేటప్పడు ఏమని చెప్పాడంటే శశీ నోట్లోంచి ఉమ్ము వేస్తే ఆ ఉమ్ము గురించి తిరిగి ఎవడూ ఆలోచించడు. ఆ ఉమ్ము వాడి నోటిలోనుండే వచ్చింది అయినా దాని గురించి ఆలోచించడు. నోట్లోనుండి ఉమ్ము ఎలాగ వేస్తామో అలాగే ఈ శరీరాన్ని విడిచిపెట్టి ఈ రోజున నేను వెళ్ళిపోతున్నాను అని ఎక్కడో మద్రాసులో ఉన్న వాడికి కలకత్తాలో ఉన్న స్వామీజీ చెప్పాడు, పగలే వాడికి ఆ సౌండు వినపడింది, కలలో కాదు. స్వామీజీకి శశి అంటే చాలా యిష్టం. ఎందుచేతనంటే ఆయనకు ఎక్కువ సహనం ఉంది. రామకృష్ణ పరమహంసగారి పేరు పెట్టుకోవటానికి నేను తగను, నువ్వే పెట్టుకోవాలి అని శశికే రామకృష్ణానంద అని పేరు పెట్టాడు, గురువు పేరు ఆయన ఒక్కరికే పెట్టారు. షిరిడీ సాయిబాబా గారు కూడా సహనం గురించి ఎక్కువగా చెప్పేవారు. అవినయం రాకుండా చూసుకోండి అని ఆచార్యులవారు చెప్పేవారు. మీరు విద్యావంతులు అయినా ధనవంతులు

అయినా, మీకు ప్రారబ్దం ఏమయినా అదృష్టం తీసుకొని వచ్చినా అవినయం రాకుండా చూసుకోండి అని చెప్పేవారు. అవినయం వస్తేమటుకు మీరు పతనమయిపోతారు.

పుట్టినవారు చనిపోతారు, చనిపోయినవారు తిరిగిపుడతారు. ఒక మనిషి పుట్టాడు అంటే వాడు చనిపోయితీరతాడు, ఒక మనిషి చనిపోయాడు అంటే పుట్టి తీరతాడు, ఇది ప్రకృతి, దీని గురించి దుఃఖమేల అన్నాడు పరమాత్మ. యిది రమణమహర్షి గారికి, రామకృష్ణ పరమహంస గారికి వర్తిస్తుందా, వారి శరీరాలు కూడా చనిపోయాయి కదా అంటే కర్మానుభవం ఉన్నప్పడు పుడతారు. కిరసనాయిలు దీపంలో కిరోసిన్ అయిపోయింది అనుకోండి మీరు ఎవరూ దానిని ఆర్పనక్కరలేదు, అదే ఆరిపోతుంది. అలాగే మీరు అనుభవించవలసిన కర్మలేనప్పడు మీ శరీరం చనిపోయాక ఇంకో దేహం రాదు. పది గాదుల్లో ఎంత ధాన్యం ఉంటుందో అంత కర్మ మనలో ఉన్నప్పడు ఇంక మనకు మోక్షం ఏమిటి? అనుభవించవలసిన కర్మ స్టోర్‌లో ఉందికదా తిరిగి దేహం వచ్చేస్తుంది. అంటే కిరోసిన్ ఉండగా దీపం ఎలా ఆరిపోతుంది. నువ్వు అనుభవించవలసిన కర్మ ఉండగా దేహాలు రావటం ఎలా ఆగిపోతాయి. ఇంకో దేహం ధరించి దానిని అనుభవించాలి కదా.

ఆచార్యులవారు నాలుగు సత్యాలు గురించి చెప్పారు. 1.పారమార్థిక సత్యం. దానికి పుట్టుక లేదు, చావులేదు, వికారం లేదు, దాని స్వరూపం సౌందర్యం, దాని స్వరూపం మంచితనం, దాని స్వరూపం ఆనందం, దానికి లేకపోవటం అంటూ లేదు, అది ఒక్కటే సత్యం, అది పారమార్థిక సత్యం. బ్రహ్మం ఒక్కటే పారమార్థిక సత్యం. 2. వ్యవహారిక సత్యం. ఇప్పడు మనం ఇక్కడ కూర్చొని మాట్లాడుకొంటున్నాము కదా ఇది వ్యవహారికసత్యం. జీవకోటి ఉంది కదా ఏదో ఎల్లమ్మ అని, సుబ్బమ్మ అని పిలవాలి కదా, ఇది వ్యవహారిక సత్యం అని ఆచార్యుల వారు చెప్పితే ఈ జీవకోటి అంతా కల్పితం అన్నారు భగవాన్. గడ్డితాడు ఉందనుకోండి అందులోనుండి ఒకో గడ్డిపరక తీసివేస్తే ఇంక తాడు ఎక్కడ ఉంది, ఏమీ లేదు. అలాగే మీకు ఉన్న అలవాట్లు, సంస్కారాలు, మీ మనస్సు యింద్రియాలద్వారా ఏ విషయాలను ఆలోచిస్తోందో ఆవిషయాలు అన్నీ తీసేస్తే ఇంక జీవుడు ఎక్కడ ఉన్నాడు. ఇదంతా కల్పితం అని మీకే తెలుస్తుంది. మనం రజోగుణం తోటి, తమోగుణం తోటి ఎక్కువ సంబంధాలు పెట్టుకొంటున్నాము. సత్వగుణాన్ని వదిలేస్తున్నాము దాని వలన మనం పతనమైపోతున్నాము. సత్వగుణంతో ఎక్కువ కాలం కలిసి ఉండటానికి ప్రయత్నం చేయండి.

3. ప్రాతిభాసిక సత్యం అంటే ఏదో కొన్ని క్షణాలు కనిపిస్తుంది తరువాత మాయమైపోతుంది. మీకు ఒక తాడు పాములా కనిపిస్తోంది అనుకోండి. మీరు మరల పరిశీలనగా చూస్తే అది తాడే అని మీకు తెలుస్తుంది అప్పుడు పాము కనబడదు. అంటే తాత్కాలికంగా లేనిది ఉన్నదాని వలె కనిపించిది, అదే ప్రాతిభాసిక సత్యం. 4. మొత్తం అసత్యం అంటే పిల్లలు లేని వాళ్ళ దగ్గరకు వెళ్ళి మీ అబ్బాయి పేరు ఏమిటి అని అడిగితే ఏమి చెపుతాడు. అది ఎంత అసత్యం. అది ప్రాతిభాసిక సత్యం కాదు. వ్యవవహారిక సత్యం కాదు, అది మొత్తానికే అసత్యం.

మన మనస్సు నిలబడటం కోసం ఆచార్యులవారు పంచాయతన వ్యవస్థ ఏర్పరిచారు. శివుడు, విష్ణువు, దేవి, గణపతి, సూర్యుడు ఈ దేవతలలో ఎవరిని ఆరాధించినా మీరు తరించవచ్చు. తరువాత సుబ్రహ్మణ్యుడిని కూడా అందులో కలుపుకున్నారు. ఆచార్యులవారు అద్వైతం గురించి చెపుతూ మరల శివుడికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇచ్చారు ఏమిటి అని కొంతమంది అంటారు. ఆయన శివకేశవుల మధ్య ఏమి భేదం చూపించలేదు. ఆయన విష్ణువు మీదే ఎక్కువ స్తోత్రాలు వ్రాసాడు, గీతాభాష్యం వ్రాసాడు. ఆయన అద్వైతి. ఒక దేవుడు అంటే యిష్టం ఉండి, ఒక దేవుడు అంటే యిష్టం లేకపోతే అది ద్వైతం అవుతుంది. ద్వైతం నిన్ను బంధిస్తుంది. రామకృష్ణుడు ఏమన్నాడంటే మీరు కోటి శాస్త్రాలు చదివినా మీ లోపల ఉన్న జీవుడు కామినీ కాంచనాలనుండి విడుదల పొందకపోతే ఇది ఆత్మ దీనికి చావులేదు, ఇది శరీరం ఇది జడం ఇది చనిపోతుంది అనే భేదం మీరు కోటి జన్మలు ఎత్తినా మీకు తెలియదు అని చెప్పాడు.

పుట్టినదానికి మరణం తప్పదు. మరణించినదానికి పునర్జన్మ తప్పదు, వీటిని ఎవరు నివారించలేరు, నివారించలేని విషయం గురించి నువ్వు శోకించకు. శరీరం ఎందుకైతే వచ్చిందో ఆ ప్రారబ్ధం అయిపోయిన వెంటనే అది పోతుంది. దానిని ఎవరూ ఆపలేరు. మనం కర్మ చేసి దాని ఫలితాన్ని ఆశిస్తున్నాము అందుచేత కర్మ మనలను చుట్టుకొంటోంది. కర్మఫలాన్ని ఆశించవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. ఇప్పుడు నేను భీమవరం వెళ్ళి పార్వతి గారు ఇంటిలో ఉన్నారో లేరో చూసి రండి అని మిమ్మల్ని పంపుతాను అనుకోండి. ఆ వెళ్ళినవాడు ఏమని చెపుతాడు, ఇంట్లో ఉంటే ఉన్నారు అని చెపుతాడు లేకపోతే లేరు అని చెపుతాడు. ఉన్నారు అని చెప్పినప్పుడు వాడికి సంతోషం రాదు, లేరు అని చెప్పినప్పుడు వాడికి దుఃఖం రాదు ఎందుచేత మనం చెప్పినపని చేసుకొని వచ్చేసాడు అంటే ఇందులో

వాడి ప్రమేయం ఏమీ లేదు. అలా మనం కర్మ చేస్తే అది మనలను చుట్టుకోదు. శాస్త్రాలలో ఎలా చెప్పారో అలా పనిచేయటమే, కర్మఫలం ఆశించవద్దు. ఇక్కడ యింకో రహస్యం ఉంది. మీరు కర్మఫలాన్ని ఆశించకపోయినా అది వస్తుంది, అలా వచ్చింది మిమ్మల్ని బంధించదు. ఇప్పుడు మిమ్మల్ని బంధించే గొడవలు ఏమైనా ఉన్నాయేమో చూసుకోండి. మీకు భయం వేస్తూంటే అది మిమ్మల్ని దేహానికి, ప్రపంచానికి బంధిస్తుంది. మీకు ఆశ ఉందా? అది మిమ్మల్ని బంధిస్తుంది. మీకు కోపం వస్తోందా? కోపం వచ్చినప్పుడు మీ స్వాధీనంలో మీరు ఉండరు. ఆ కోపం మిమ్మల్ని శరీరానికి, ప్రపంచానికి బంధిస్తుంది. ఏదయితే మిమ్మల్ని శరీరానికి, ప్రపంచానికి బంధిస్తోందో అదేతలంపు తిరిగి మీకు శరీరాన్ని తీసుకొని వస్తుంది. అంటే మీకు పునర్జన్మ వచ్చి తీరుతుంది. దీనికి అడ్డుదారులు ఏమయినా ఉన్నాయి అనుకొంటున్నారేమో, పరుగెత్తి పారిపోవటానికి అడ్డదారులు ఏమీ లేవు. ఎస్కేపిజమ్ కుదరదు అంటున్నారు ఆచార్యులవారు. భగవంతుడిని మనం మోసం చేయలేము.

ప్రాణం పోయేటప్పుడు అంటే జీవుడు శరీరాన్ని విడిచిపెట్టే సమయంలో నన్ను స్మరించుకొంటే మీకు నా స్వరూపాన్ని ఇస్తాను, మీరు మోక్షాన్ని పొందుతారు అని భగవంతుడు చెప్పాడు. ఆ మాటలు విని ఇది ఏదో షార్ట్‌కట్ అని మీరు అనుకోవద్దు అని ఆచార్యులవారు చెపుతున్నారు. ఇలా అడ్డదారిని పోదాం అనుకోవద్దు. జీవితం పొడుగునా భగవంతుడిని స్మరించుకొంటూ, ఆయనను ధ్యానించుకొంటూ ఉన్న వారికి మాత్రమే ప్రాణప్రయాణ సమయంలో దైవస్మరణ వస్తుంది కాని, లేకపోతే దైవస్మరణ రాదు. భగవంతుడు చెప్పాడని అది పట్టుకొని మీరు జీవితం పొడుగునా విషయచింతన చేస్తూ, చనిపోయేటప్పుడు దైవస్మరణ గురించి చూసుకొందాము అనుకొంటే ఆ టైములో మీకు ఎన్నడూ దైవస్మరణరాదు. మొన్న ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. మొన్న అస్థికలు కలపటానికి రాజమండ్రి వెళ్ళాను. అక్కడ నా అనుభవం చెబుతాను. అస్థికలకు పూజలు చేసి పిడతలో అస్థికలు వేసి నదిలో కలపమని చెప్పారు. నదిలో కలిపేటప్పుడు కృష్ణా, కృష్ణా అనుకోవాలి అని నేను అనుకొన్నాను. కాని ఒక్క క్షణంలో నదిలో కలిపే సమయంలో కృష్ణా, కృష్ణా అని రాలేదు, అమ్మ అమ్మ అని వచ్చింది. ఆ పిడతను నా చేతిలో పెట్టినప్పుడు ఏమనుకున్నాను కృష్ణా, కృష్ణా అనుకోవాలి అనుకొన్నాను. కాని నదిలో కలిపేటప్పుడు అమ్మ, అమ్మ అన్నానుకాని కృష్ణా, కృష్ణా అని రాలేదు అంటే ఒక్క క్షణంలో ఇంత తేడా వచ్చేసింది. అంటే అడ్డదారులు

లేవు అని ఆచార్యులవారు చెప్పిన మాటలు ఇక్కడ అనుభవంలో తెలిసిపోయింది. మన ప్రాణప్రయాణ సమయంలో భగవంతుడుని స్మరించుకొందాము అని మీరు అనుకోవచ్చు కాని మీరు అనుకొన్నది రాదు, లోపల ఉన్నదే వస్తుంది. ప్రాణం ఎలా పోవాలి అని చెప్పారు అంటే దోసకాయ పాదుకి కాస్తుంది. మీరు ఆ దోసకాయను కొయ్యటం మానేస్తే పండిన తరువాత దానంతట అదే ముచ్చిక నుండి విడిపోతుంది. అలాగే ఈ శరీరాన్ని జీవుడు అంత సహజంగా విడిచిపెట్టాలి. అంత సహజంగా ఎప్పడు విడిచిపెడతాడు అంటే మీకు బంధాలు లేనప్పడు మాత్రమే అలా విడిచిపెట్టగలరు.

కర్మఫలాన్ని ఆశించవద్దు. నువ్వు కర్మఫలం ఆశించకపోయినా అది వస్తుంది. ఇక్కడ గుర్తించవలసింది ఏమిటంటే కర్మఫలాన్ని నువ్వు ఈశ్వరప్రసాదంగా తీసుకోవాలి కాని అది నేను సాధించాను అనే భావన ఉంటే అది నిన్ను చుట్టుకొంటుంది. కర్మఫలం ఈశ్వరుని ఆజ్ఞననుసరించి వస్తుంది కాని కేవలం నువ్వు చేసిన పనిని బట్టి రాదు. కర్మఫలాన్ని ఈశ్వరుడే ఇచ్చాడు కాబట్టి దానిని ఉపయోగించేటప్పడు ఇచ్చినవాడు ఈశ్వరుడు, తీసుకొనేవాడు ఈశ్వరుడు అనే భావనతో చేస్తే అప్పడు కర్మ నశిస్తుంది. ప్రతీదీ ఈశ్వరభావనతో చేస్తేనే కర్మ కాలిపోతుంది కాని ఇది నేను చేసాను అని పైకి అనకపోయినా, లోపల ఆ భావన కనుక నీకు ఉంటే అది మరల నువ్వు అనుభవించి తీరాలి, దానికోసం జన్మలు తప్పవు. ఇప్పడు మీకు కోరిక ఉంది. కోరికకు శక్తిలేదు. మీ ప్రారబ్ధంలో లేనిది మీరు కోరుకొన్నా అది రాదు. మరి ఎందుకు కోరుకొంటున్నాము అంటే మనకు అలా అలవాటయిపోయింది. ఆ కోరిక మనలను శరీరానికి, లోకానికి బంధిస్తుంది. అదే మరల మనకు శరీరాలను తీసుకొని వస్తుంది.

వేదాలలో రకరకాల గొడవలు చెప్పారు. గుణాల గురించి, భోగాల గురించి, ఆ భోగాలను పొందటానికి ఏ యజ్ఞం చేస్తే ఆ భోగం వస్తుందో ఇవి అన్నీ చెప్పారు. వేదాలలో ఎన్ని చెప్పినా ఆ గొడవలన్నీ పూర్తిగా శేషం లేకుండా వదులుకో. భోగాలు దేనితో అనుభవిస్తారు, శరీరంతో అనుభవిస్తారు. అసలు నీకు భోగకాంక్ష లేనప్పడు శరీరంతో నీకు పని ఏమిటి? నీ దేహప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి సుఖం వస్తుంది, ఒకోసారి దుఃఖం వస్తుంది. సుఖం వచ్చినప్పడు దానితోటి కలవకు, దుఃఖం వచ్చినప్పడు దానితోటి కలవకు. ఆ రెండింటికీ అతీతుడుగా ఉండు. నిరంతరం పరమాత్మ స్మరణలో ఉండు. ప్రతీ జీవుడు యోగక్షేమాల

గురించి ఆలోచించుకొంటున్నాడు. నీ మనస్సును యోగక్షేమాల మీద నిలబెడుతున్నావు కాని పరమాత్మ మీద నిలబెట్టటంలేదు. 24గంటలు నీ యోగక్షేమాల గురించి ఆలోచించుకొంటూ బిజీగా ఉన్నాము అంటారు, ఏదో ఆరాటపడుతూ ఉంటారు.

పాపాలు వందరకాలు ఉండవచ్చును. కాని మూలపాపం ఏమిటి అంటే దేహము నేను అనే తలంపే మూలపాపం. మీరు చూసుకోండి. గాఢనిద్రలో మనకు దేహభావన లేదు. మెలకువ రాగానే మొదట నేను అనే తలంపు వచ్చి దేహంతో తాదాత్మ్యం పొందుతుంది. అక్కడ నుండే మొత్తం గొడవలు అన్నీ వస్తున్నాయి, అక్కడ నుండే పాపాలు ప్రారంభమవుతున్నాయి. దేహము నువ్వు కాకపోయినా ఆ దేహం కోసమే నువ్వు అన్ని పాపాలు చేస్తున్నావు. నీ యోగక్షేమాలగురించి ఆలోచించినా, ఇతరులను ద్వేషించినా, కక్షలు కపటాలు పెట్టుకొన్నా ఇవన్నీ దేహంకోసమే నువ్వు చేస్తున్నావు. మీరు గుర్తింపులు కోరుకుంటున్నారు, అదీ దేహం కోసమే కదా! దేహభావన లేనివాడికి ఇంక గుర్తింపులు ఏమిటి? దేహం కోసమే ఇవి అన్నీ చేస్తున్నాము. అంతకుమించిన పాపం ఏముంది? దట్ ఈజ్ ఒరిజినల్ సిన్. త్యాగరాజుగారికి తంజావూరు మహారాజు బంగారపు ముద్దలు పంపాడు. ఆ కుటుంబంలో పేచీలకు ఆ బంగారమే కారణం. అంతకు ముందు అన్నదమ్ములు స్నేహంగా ఉండేవారు, అప్పటి నుండి విరోధం ప్రారంభమయింది. మహారాజుగారి మనుషులు బంగారం తెచ్చి ఇచ్చారు. వారిని కూర్చోమని చెప్పి త్యాగరాజు ఒక పాట పాడాడు. ఓ మనసా! నీకు నిధి కావలంటే నిధి ఉంది, రాముడు కావాలంటే రాముడు ఉన్నాడు. నీకు ఈ నిధి సుఖమా లేక రాముడి సన్నిధి సుఖమా అని మనస్సును అడుగుతున్నాడు. రాముడి సన్నిధి సుఖం అని ఆయనకు లోపలనుండి స్ఫురించింది. అప్పుడు ఆ బంగారం వారికి ఇచ్చేసి పంపేసాడు. అప్పుడు త్యాగరాజు అన్నగారు ఏమన్నాడు అంటే నీకు అక్కరలేకపోతే నాకు ఇవ్వవచ్చుకదా బంగారం అని అప్పటినుండి తమ్ముడితో విరోధం మొదలయ్యింది. ఆ రాత్రి రాముడి విగ్రహాలు తీసుకొని వెళ్ళి అన్నగారు కావేరీ నదిలో పడేసాడు. నా రాముడు ఏమయ్యాడు అని త్యాగరాజు గోల పెడుతున్నాడు. వేరుభావన ఉన్నప్పుడు ఈ తిప్పలు తప్పవు. రాముడు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి ఆయనకు పోలేదు. రాముడి గురించి గోలపెడుతూ ఉంటే అప్పుడు రాముడు స్వప్న దర్శనం యిచ్చి నేను ప్రవాహంలో కొట్టుకొనిపోలేదు, అక్కడే ఉన్నాను అని చెపితే అప్పుడు

వెళ్ళి ఆ విగ్రహాలను తెచ్చుకున్నాడు. ఇదంతా వేరుభావనలో నుండి వచ్చింది. వేరుభావన ఉన్నప్పుడు సంసారం తప్పదు, త్యాగరాజు అంతటివాడు కూడా దుఃఖపడుతున్నాడు కదా!

నీకు భోగదృష్టి ఉన్నంతసేపు నీ బుద్ధికి స్థిరత్వం ఉండదు. బుద్ధిని పాడుచేసుకోవద్దు. నీ బుద్ధిని పరమాత్మ మీదే నిలబెట్టి ఉంచు. ద్వైతబుద్ధిని తగ్గించుకో. మిమ్మల్ని ఏ విషయాలు బంధిస్తున్నాయో, మీ మనస్సు ఎక్కడికి వెళుతోందో చూసుకోండి. మీకు మమకారం లేకపోతే మీ మనస్సు చలించదు. మమకారం వల్లనే భగవంతుడి మీద మీ మనస్సు నిలబడదు. మమకారం వల్లనే మనస్సు బాహ్యాముఖమవుతూ ఉంటుంది. మనస్సు అంతర్ముఖం అవ్వకుండా భగవంతుడు మీకు తెలియబడడు. నిరంతరం పరమాత్మను స్మరించటంవలన మాకు ఒక దేహం ఉంది కదా, దాని అవసరాల మాట ఏమిటి అని అడుగుతున్నారు. మీ బుద్ధి పరమాత్మ మీద స్థిరపడి ఉంటే దె విల్ బి మెట్ అని చెప్పాడు. నీ ఆశను భగవంతుడు తీర్చలేడు కాని నీ అవసరాలను భగవంతుడు తీరుస్తాడు, అవి నెరవేరతాయి. మీ దేహం యొక్క అవసరాలు ఏమిటో, మీకు ఏమి కావాలో పరమాత్మకు తెలియదా? మీకు ఎప్పుడు ఏది ఇవ్వాలో అన్నీ ఆయనే చూసుకొంటాడు.

అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెపుతున్నాడు. ఉంటే మాకు దర్శనం ఇవ్వాలి కదా అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమన్నారు అంటే నీ అలవాట్ల యొక్క వేగంలోనుండి, నీ వాసనల యొక్క వేగంలోనుండి, నీ కోరికల యొక్క వేగంలోనుండి బయటకు రా అప్పుడు అంతర్యామి ఉన్నాడో, లేడో నీకే తెలుస్తుంది. నువ్వు 105 డిగ్రీల జ్వరం పెట్టుకొని కూర బాగోలేదు అంటే అసలు దాని అర్థం ఏమిటి? అన్నారు. నీకు బాహ్యంగా లోకంలో ఉన్న వస్తువులతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి స్పర్శ లేకపోయిన లోపల వాసన ఉంటుంది. కిరసనాయిలు సీసాలో ఉన్న కిరసనాయిలు అంతా వంచేసినా ఆ సీసా కిరోసిన్ వాసన వస్తుంది. అందులో కిరోసిన్ లేకపోయినా వాసన వస్తూ ఉంటుంది, సీసా కడిగినా వాసన పోదు. అలాగే బాహ్యంగా నీకు వస్తువులతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి సంబంధం పోయినంతమాత్రంచేత వాసన పోయిందని అనుకోకు. కిరోసిన్ సీసాను శుభ్రంగా కడిగి పది రోజులు ఎండలో పెడితే ఆ వాసన పోతుంది కాని లేకపోతే పోదు. అలాగే నీ మనస్సును ఎండబెట్టగా ఎండబెట్టగా లోపల ఉన్న వాసన నశిస్తుంది. గురువు అనుగ్రహం లేకుండా ఇది సాధ్యం కాదు.

గురువు అవసరం లేదా అని ఒకరు భగవాన్‌ని అడిగితే, అవసరమే అన్నారు. మరి మీరు మాకు గురువుగా అంగీకరించటం లేదు కదా అంటే అంగీకరించటం లేదు అన్నారు. అయితే గురువుకోసం మేము ఎక్కడికయినా వెళ్ళాలా అని అడిగితే నాకు వేరుగా మీరు కనిపించినప్పడు మీరు శిష్యులు, నేను గురువుని. కాని మీరు నాకు వేరుగా కనిపించటం లేదు కాబట్టి నేను మీకు గురువు అని ఎలా చెబుతాను. మీరు నా కంటే వేరుగా లేరు. వేరుగా ఉంటే అది కల్పించబడింది. నాలో ఏది ఉందో మీలో అదే ఉంది. మీలో ఏది ఉందో నాలో అదే ఉంది. నాలో ఏది ఉందో అదే మీలో చూడకుండా భిన్నంగా ఉన్నదేదో నేను చూస్తూంటే అక్కడ భేదబుద్ధి ఉన్నట్లే. జ్ఞానికి భేదబుద్ధి ఉంటే వాడు జ్ఞాని అవుతాడా? అయితే టీచింగువల్ల ప్రయోజనం ఏమిటి అంటే మీ స్వరూపం కంటే వేరుగా ఏదో ఉంది అనుకుంటున్నారు కదా! టీచింగు మీకు అర్థం అవుతూ ఉంటే ఆ వేరుబుద్ధి కరిగిపోతుంది. అప్పడు ఉన్నది ఉన్నట్టుగా మీకు వ్యక్తమౌతుంది. ఉన్నది ఉన్నట్టుగా వ్యక్తమయ్యేవరకూ లేనిది ఉన్నట్లుగా కనిపిస్తూ ఉంటుంది. ఎక్కడైతే సుఖం ఉందో, ఎక్కడైతే శాంతి ఉందో, ఎక్కడైతే ఆనందం ఉందో, ఎక్కడైతే సౌందర్యం ఉందో దానికంటే వేరుగా నేను ఉన్నాను అని నువ్వు అనుకోవటమే అజ్ఞానం. నీ లోపల అజ్ఞానం ఉంది కాబట్టి నువ్వు వేరుగా ఉన్నాను అనుకుంటున్నావు. నీ లోపల ఉన్న అజ్ఞానం పోతే ఆ వేరుతనం పోతుంది. అప్పడు స్వరూపం అనుభవంలోనికి వస్తుంది.

నిరంతరం నీ యోగక్షేమాల గురించి ఆలోచించుకొనే బదులు నీ అంతఃకరణాన్ని నువ్వు స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అంతఃకరణం అంటే లోపల పనిముట్టు. నీ లోపల ఉన్న పనిముట్టు మనస్సు. మనస్సుని స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మనస్సుని నిర్మలంగా ఉంచుకో, శాంతిగా ఉంచుకో. సత్వగుణంతో బంధుత్వం పెట్టుకో, సత్వగుణంతో బంధుత్వం పెట్టుకుంటే అది బ్రాహ్మీస్థితి కాకపోయినా బ్రాహ్మీస్థితి పొందటానికి దారి చూపిస్తుంది. మనుషులు రకరకాల గుణాలతో ఉంటారు. మన మనస్సుకి వికారం పుట్టకుండా చూచుకోవాలి. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తే మీకు సంతోషం వస్తోంది అనుకోండి. అది ఒక వికారం. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే మీకు దుఃఖము వస్తోంది అనుకోండి. అది ఒక వికారం. అలా ఉంటే మీరు ఔట్. ఇంక మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మీకు బ్రాహ్మీస్థితి పొందటానికి యోగ్యత, అర్హత లేదు. మీరు డిజర్వు అవ్వలేదని అర్థం.

మనస్సులో పుట్టే వికారాలని మీరు తొలగించుకోకపోతే, ఎదుటి వాళ్ళ మాటల వల్ల సంతోషపడి లేకపోతే వారి మాటల వలన దుఃఖపడి ఇలా మనస్సులో మీకు కెరటాలు వస్తూ ఉంటే ఇంక మీకు బ్రాహ్మీస్థితి కలుగదు అని పరమాత్మ అన్నాడు. మీరు అందరూ బుడగలు ఆ బుడగను పోగొట్టుకోకుండా కాపాడుకుంటున్నారు. బుడగపోతే మీకేమీ నష్టం లేదు. అది సముద్రం అవుతుంది. అలాగే వ్యక్తిభావన పోతే మీకు బ్రాహ్మీస్థితి కలుగుతుంది. కానీ మీరు బుడగను పగలనివ్వరు కదా.

కర్మఫలానికి నువ్వు కారణం అవ్వవద్దు. కర్మఫలానికి నువ్వు కారణం అయ్యావా పునర్జన్మ వచ్చితీరుతుంది. పార్వతిగారూ మీరు చాలా బాగా చెబుతున్నారు అని పార్వతిగారిని అంటే, పార్వతిగారికి సంతోషం వస్తోంది అనుకోండి. ఆవిడ కర్మఫలానికి కారణం అయిపోతున్నారు. అంటే వికారం వచ్చేసింది. మీరు ఆ మాట అననప్పుడు ఆవిడ ఎలా ఉన్నారో మాట అన్నాక కూడా నిర్వికారంగా ఉండాలి. వికారం వచ్చిందా పునర్జన్మ వచ్చి తీరుతుంది. మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. అజాగ్రత్త పనికిరాదు. అశ్రద్ధ పనికిరాదు. శ్రీకృష్ణచైతన్య దగ్గర ఒక ముస్లిం భక్తుడు ఉండేవాడు. ఒకసారి శ్రీకృష్ణచైతన్యుడు ఆ భక్తుడితో అన్నాడు నువ్వు చాలా మంచివాడవు. ఎందుకంటే ఇతరులు నిన్ను గౌరవించకపోయినా నువ్వు ఇతరులను గౌరవంగా చూస్తున్నావు. వాళ్ళు గౌరవించడంలేదని నువ్వు మనస్సులో కూడా అనుకోవు. ఇతరులు నీకు నమస్కరించకపోయినా నువ్వు ఇతరులకి నమస్కారం చేస్తావు. ఇదంతా నీ మంచి బుద్ధికి గుర్తు అన్నాడు. అప్పుడే నన్ను మంచివాడని అనకండి. నా ముక్కులో గాలి బయటకు వెళ్ళిపోయిన తరువాత అప్పుడు మంచివాడిని అని చెప్పకోండి. మనస్సుని నమ్మలేము అన్నాడు. చైతన్యుడు ఆ భక్తుడిని నీకు ఏమయినా కోరిక ఉంటే కోరుకో అన్నాడు. నాకు కోరిక ఒకటి ఉంది. గురువు శరీరం ఉండగా నా శరీరం పోవాలి. గురువు లేని ఈ లోకాన్ని నేను చూడలేను. అందుచేత మీ శరీరం ఉండగానే నా శరీరం ముందు పోవాలి. అంతకంటే నేను కోరేది ఏమీ లేదు అన్నాడు. తరువాత ఆ భక్తుడు మరణించాడు. అప్పుడు చైతన్యుడు ఆయన చేతలతో ఆ భక్తుడిని పూరీలో సముద్రం ఒడ్డున సమాధిచేశాడు.

నువ్వు చెయ్యవలసిన డ్యూటీ ఇష్టంగానే చెయ్యి. అయిష్టంగా చెయ్యకు. ఒకోసారి

ఫలితం వస్తుంది. ఒకోసారి ఫలితం రాదు. అందుచేత నువ్వు రెండింటి పట్ల సమభావన కలిగి ఉండు. అప్పుడు నీకు రాబోయే జన్మలకి సంబంధించిన బీజాలు, వాసనలు కాలిపోతాయి. పాపానికి సంబంధించిన, వ్యక్తిభావనకి సంబంధించిన ఆ దుంప నీలోపల ఉంటే పునర్జన్మలు ఆగుతాయా? ఆ పాపపు దుంప ఉందో, లేదో మీరు చూసుకోవాలి. గడ్డి వేసవికాలంలో ఎండిపోయి ఉంటుంది. వర్షాలు పడితే ఆ గడ్డి అంతా మళ్ళీ వచ్చేస్తుంది. అలాగే మీకు అవకాశం లేనప్పుడు ఆ దుంప అలా పడి ఉంటుంది. మళ్ళీ అవకాశాలు రాగానే దుంప మొలిచిపోతుంది. ఆ దుంప ఉన్నంతకాలం మిమ్మల్ని మీరు నమ్మకండి అని ఆచార్యులవారు చెబుతున్నారు. లోపల దుంప ఉండగా నాకు దుంప లేదని చెపితే వాడిని మిధ్యాచార్యుడు అంటారు. ఆ పాపపు దుంప పూర్తిగా వేరుతో సహా నశించేవరకు మనం దానిని నమ్మటానికి వీలులేదు. ఆ దుంప కాలి బూడిద అయిపోయింది అనుకోండి ఇంక ఎంత వర్షం కురిసినా అది మొలవదు. కొంతమంది దారిద్ర్యం ఉన్నప్పుడు ఎలా ఉంటారో, ఐశ్వర్యం వచ్చినా అలాగే ఉంటారు. ఉండటం, లేకపోవటం అనేవి ప్రకృతి విషయాలు. అవి వాళ్ళ మీద ప్రభావం చూపించవు. అవి ప్రభావం చూపిస్తూ ఉంటే నీకు పునర్జన్మ తప్పదు. ఉండటం, లేకపోవటంతోటి సంబంధం లేకుండా, ప్రకృతి విషయాలతోటి సంబంధం లేకుండా నువ్వు సమాన బుద్ధి కలిగి ఉంటే ప్రకృతిని దాటి వెళ్ళిపోతావు. దైవంలో ఐక్యం అవ్వటంకోసం నువ్వు ప్రకృతిని దాటి వెళ్ళాలి అన్నాడు పరమాత్మ.

శంకరాచార్యులు వారు శాస్త్రాలన్నిటికీ భాష్యాలు వ్రాసి ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఈ రోజున భగవద్గీత ఎంతో కొంత మనం అర్థం చేసుకొంటున్నాము అంటే ఆయన పెట్టిన భిక్షే. బ్రాహ్మీస్థితిని పొందటానికి అనేక ఉపాయాలు మనకి ఆచార్యులవారు చెప్పారు. ఆచార్యులవారు ద్వైతం గురించి, విశిష్టాద్వైతం గురించి, అద్వైతం గురించి అన్నీ చెప్పారు. కృష్ణుడిమీద, గోవిందుడి మీద కూడా ఎక్కువ స్తోత్రాలు వ్రాసారు. కానీ ఫైనల్‌గా నువ్వు సత్యానుభవం పొందాలి. సత్యము ఒకటిగా ఉంటుంది కానీ రెండుగా ఉండదు. నిద్రపోతున్న మనల్ని సత్యం వైపుకు మేల్కొలపటానికి శాస్త్రాలన్నిటికీ భాష్యాలు వ్రాసి, స్తోత్ర గ్రంథాలు వ్రాసి దేశం అంతా కాలి నడకన తిరిగి బోధించి మానవజాతికి సహాయ సహకారములు అందించిన ఆచార్యులవారికి హృదయపూర్వక కృతజ్ఞతలు, నమస్సులు సమర్పించుకొంటున్నాను.

జూలై 22 గురుపౌర్ణమి - సత్యసాయి నిగమ్, శ్రీ నగర్ కాలనీ, హైదరాబాద్

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# గురుపూర్ణిమ

బోధ గురువు భగవాన్ శ్రీ వ్యాసమహర్షి జన్మదినమైన ఆషాఢ శుద్ధ పూర్ణిమను గురుపూర్ణిమ, వ్యాసపూర్ణిమగా జరుపుకుంటూ, వారి వారి గురువులను ఆరాధించుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. గురువు అన్న పదమునకు అర్థం అనంతము, అద్వితీయము అయిన చైతన్యమే! అట్టి చైతన్యము మానవాకృతి ధరిస్తే, అదే గురురూపం. అందుకే గురుసాక్షాత్ పరబ్రహ్మ అంటారు. గురువంటే ఒక వ్యక్తికాదు, సాక్షాత్తు బ్రహ్మమే! గురువు అనుగ్రహ స్వరూపుడు, త్రిమూర్తి స్వరూపుడు. సద్గురువులందరు ఉపనిషత్తుల సారాన్ని జీవించి చూపించారు. దత్తాత్రేయుడు ప్రపంచంలో ఉన్న సకల వస్తువులను గురుస్వరూపంగానే పేర్కొంటాడు. ఉత్తమమైన మానవజన్మ లభించడం, పిమ్మట సద్గురువు లభించడం, అట్టి సద్గురువు పట్ల సజీవ విశ్వాసం కలిగియుండడం, గురుబోధ శ్రవణం చేసి దానిని ఆచరించడం, ఇవన్నీ పూర్వ జన్మలలో చేసిన సత్కర్మల యొక్క పుణ్యఫలితమే అంటారు మహాత్ములు. సద్గురువుపట్ల నిజమైన ప్రేమ దేహేంద్రియ మనోబుద్ధులతో మనకి ఉన్న తాదాత్మ్య దోషాన్ని నిర్మూలిస్తుంది. సద్గురువును త్రికరణశుద్ధిగా సేవిస్తే, ముక్తికి మార్గం సులభమవుతుంది. సూర్యుడు ఎలాగైతే బాహ్యమైన చీకటిని పోగొడతాడో, అట్లే గురువు లోపల ఉన్న అజ్ఞానమనే చీకటిని నిర్మూలించి, స్వరూప చైతన్యంలోకి మేల్కొలుపుతాడు. ఆధ్యాత్మిక అభివృద్ధికి గురువు అవసరమా? అని భగవాన్‌ని ప్రశ్నిస్తే, ఖచ్చితంగా అవసరమే అని చెప్పారు. గురువుతో మానసిక అనుబంధం ముఖ్యం. హృదయంలో ఉన్న బ్రహ్మమే మన హితవుకోరి, మార్గదర్శిగా మనను నడిపించడానికి, బాహ్యగురురూపంలో వస్తాడు. జనన మరణ ప్రవాహం నుండి మనను రక్షించే ఘనవైద్యుడు గురువు, అట్టి గురువు యొక్క కృప లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. అనాదిగా అనుగ్రహరూపంలో వస్తున్న గురు పరంపర జీవకోటికి మార్గదర్శకమై స్వరూప అమృతస్థితిలోకి మేల్కొలుపుతూనే ఉంది.

(22-07-2013న గురుపూర్ణిమ సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# గురువుకృప - పుణ్యసంస్కారం వల్ల లభిస్తుంది

మనం మంచి శిష్యులమైతే చెడ్డగురువు లభించడు. అలాగే చెడ్డ శిష్యునికి మంచి గురువు లభించడు. ఎందుకంటే ఆయన వాడి బాధ్యతలను స్వీకరించాలి. ఎవ్వరూ చెత్తను పోగుచేసుకోరు కదా! గురువును అన్వేషించేడప్పుడు మనలో లోపాలు వెదకాలి. గురువులు లేరని, అసలు అటువంటి సద్గురువు ఇప్పుడు ఎవరున్నారు. పూర్వం ఉండేవారని పిచ్చిప్రలాపాలు పుణ్యం లోపించటం వల్ల మాట్లాడుతారు. గురువును ఆకర్షించే శక్తి మనలో ఉందా? అని చూచుకోవాలి. ఏసు 'సద్‌గురువు లేని కాలం అంటూ ఉండదు' అన్నారు. గురుదేవుల చుట్టూ ముళ్లకంచె ఉంటుంది. కపటశిష్యులు వస్తే దత్తాత్రేయులు కల్లుకుండలతో, వనితలతో ఉండేవారు. భగవాన్‌వద్దకు మోకాళ్ల నొప్పులు తగ్గుతాయని వెళితే తన మోకాళ్లను ఆయనే నొక్కుకొంటే కపటగురువు అని సణుక్కొని వెళ్లిపోయేవారు. కాని మనం తయ్యారై వెడితే ఆముళ్లపొదలు దాటి వెళ్లగలము, దారి వారే చూపిస్తారు. వేమన 'గొఱ్ఱెలు పదివేలు కూడియుండినచోట, తల్లినెరిగి వచ్చుదాని కొదమ, పరమయోగినెరిగి భక్తుండు వచ్చురా!' అన్నారు. గురువు అంటే సాధకునకు ఏ మాత్రం తెలియని దారులను చూపించేవాడని అర్థం. మనం ఆధ్యాత్మికంగా గుడ్డివాళ్లము. కళ్ళుతాను నేర్చుకొన్న విశేషాలను చూడగలవు ప్రకృతిలో. మన కళ్ళు గురువు ఆనందపు మెరుపులను పట్టుకోలేకపోతున్నాయి. తాను ఎవరో తెలిసిన గురువుతో కలసి కదలాలి. ఆ దారిలో తప్పు ఏదైనా జరిగితే ఆయన సరిచేయగలరు. మనగతం, అనాగతం అన్నీ తెలిసి సత్యంవైపుకు తీసుకొని వెళతారు. మనం గురువు మాటలను వింటాము కాని ఆ భావాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేము. ఆ శక్తిని చివరకు ఆయనే మన శ్రమను గుర్తించి నిరీక్షించి అనుగ్రహిస్తారు. అర్థం చేసుకొనే ఔషధాన్ని ఇస్తారు. ఆత్మ వెలుతురు వైపు మనకళ్లను తెరుచుకొనే సాయం చేస్తారు. మనం గురువు యొక్క అంతఃప్రత్యక్షాన్ని ఉనికిని ఆలోచించాలి దాని ప్రగాఢతనే దర్శించాలి. గురువు సమక్షంలో ఆయన శక్తి మనలను ఆవరిస్తుంది. ఆ శక్తిక్షేత్రంలో మనలను ముంచివేయబడినప్పుడు మనలో శక్తి ఉద్భవిస్తుంది. ఆ శక్తి మనదే. అప్పుడు ప్రకటనలు సంభవించటం ప్రారంభిస్తాయి. కాని గురువుయొక్క సమక్షం లేకుండా బహుశా అవి సంభవించి ఉండేవి కావు. ఆయన ప్రశాంత నిశ్శబ్ద మహోన్నత స్థితిని చూచినవానికి మన స్వగృహం జ్ఞప్తికి వచ్చి ఉంటుంది. దాన్ని పొందాలనే ప్రగాఢ వాంఛ రేకెత్తుతుంది. ఆయన కళ్లలోకి లోతుగా చూస్తూ అనంతమైన విస్తారతను వీక్షిస్తూంటే మనలను మనం కోల్పోతాము. ఆ చూపులు సత్యంలో ముంచబడినవి. ఆయన స్వంత రుచిజ్ఞానం ప్రేరేపించబడుతుంది. సత్సంగం యొక్క అర్థం ఇదే. ఇది సాధ్యంకానినాడు ఐదునిమిషాలు వారి ఛాయాచిత్రంలో కళ్ళుచూస్తూంటే వారు అక్కడే ఉంటారు. శ్రీనాన్నగారు 'మహాత్ముల దర్శనం వలన అందరూ బాగుపడరు, కాని సత్‌పురుషలు, సజ్జనులు బాగుపడతారు తనను తాను బాగుచేసుకోవాలనే బుద్ధి ఉంటుంది. కాబట్టి ఒక జ్ఞానదీపం వెలిగితే అనేక దీపాలు దాన్నిబట్టి వెలుగుతాయి' అన్నారు. మన దీపం వెలగటానికి మనలను మనం బాగుచేసుకోవటానికి ఇంతకన్నా హామీ ఏమి కావాలి?

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం